కార్పొరేషన్‌లో అంతర్గత బదిలీలు

- పలువురు ఉద్యోగులకు స్థానభ్రంశం
- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పాలనలో కమిషనర్ రవీంద్రబాబు స్వల్ప మార్పులు చేశారు. విధి నిర్వహణలో సక్రమంగా విధులు నిర్వర్తించకపోవడం, చాలా ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న వారితో పాటు ఫిర్యాదులు వస్తున్న వారిని ఇతర విభాగాలకు బదిలీలు చేశారు. నగరపాలక సంస్థలోని రెవెన్యూ విభాగం, పట్టణ ప్రణాళిక విభాగం, ఇంజినీరింగ్ విభాగం పారిశుద్ధ్య విభాగం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ విభాగాల్లో ఈ మార్పులు చేశారు. ఆరు నెలల క్రితం రెవెన్యూ విభాగంలో ఇరువురికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా కమిషనర్ బాధ్యతలు అప్పగించారు. వీరిరువురికి అదనంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో జీ–3 క్లర్కుగా, రెవెన్యూ విభాగంలో ఏ–2 క్లర్కుగా బాధ్యతలు అప్పగించారు. అలాగే రెవెన్యూ విభాగంలో ఏ–2 గా ఉన్న ఉద్యోగిని ఇంజినీరింగ్ విభాగానికి మార్పులు చేశారు. ఈ మేరకు గురువారం వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 11 మంది ఉద్యోగులకు స్థాన చలనం కల్పిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అంతర్గతంగా బదిలీ అయిన ఉద్యోగులు వెంటనే వారికి కేటాయించిన విధుల్లో చేరాలని లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



నగరపాలక సంస్థ కార్యాలయం

బదిలీ అయిన ఉద్యోగులు వీరే..

ఎస్.తిప్పన్నకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో పాటు టౌన్ ప్లానింగ్‌లో జీ–3 క్లర్క్, టీ.శ్రీనివాసులు హెచ్–1 నుంచి ఏ–1 గా మార్పు చేశారు. సీనియర్ అసిస్టెంట్ ఎం.రాజు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఇదే విభాగంలో ఏ–2గా పనిచేస్తున్న సుహెయిల్ అహమ్మద్‌ను ఇంజినీరింగ్ విభాగంలో ఇ–1 క్లర్క్‌గా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఎస్.మన్సూర్ బాషాను టౌన్ ప్లానింగ్ విభాగంలో జీ–1 గా నియమించారు. జూనియర్ అసిస్టెంట్ ఏ.సుధా గ్రేస్‌ను జీ–4కు ఎస్.ఇస్మాయిల్‌ను ఇంజినీరింగ్ విభాగంలో ఇ–3 గా బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న డి.నరసింహయ్యను పారిశుద్ధ్య విభాగంలో ఎఫ్–5లో నియమించారు. ఎఫ్–5లో పనిచేసే ఎం.శివశంకర్‌ను ఎఫ్–1 పారిశుద్ధ్య విభాగానికి, జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఎం.అబ్దుల్ రసూల్‌ను పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో హెచ్–1 క్లర్క్‌గా బదిలీ చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆర్.రాజుకు అదనంగా ఏ–3 క్లర్క్‌గా నియమించారు.

పారిశుద్ధ్య పర్యవేక్షణకు ఎస్‌ఐల నియామకం

నగరంలోని 52 వార్డుల్లో పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ కోసం నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఐదుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లను నియమించారు. ఈ మేరకు గురువారం కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలో ప్రతి శానిటేషన్ డివిజన్‌లో జరుగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు, డోర్–టు–డోర్ చెత్త సేకరణ, డి–సిల్ట్ పనులు, డ్రైనేజీ సమస్యలను గుర్తించడం, పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వీరందరూ పర్యవేక్షణ చేయనున్నారు. మరింత మెరుగ్గా శానిటేషన్ నిర్వహణ కోసం జి.రమేష్, బి.అనీల్‌కుమార్, షాకీర్ హుస్సేన్ బాషా, కె.ఫరూక్ అబ్దుల్లా, కె.కార్తీక్‌లకు బాధ్యతలు అప్పగించారు.

సీపెట్ డిప్లొమో కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(సెంట్రల్): భారత ప్రభుత్వ సంస్థ అయిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) కోర్సుల్లో ప్రవేశాలకు మే 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ డైరక్టర్ అండ్ హెడ్ సీహెచ్ శేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి అర్హతతో 3 సంవత్సరాల వ్యవధి కలిగిన డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ(డీపీఎంటీ), బీఎస్సీ విద్యార్హతతో 2 సంవత్సరాల వ్యవధి కలిగిన పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ–పీపీటీ) అనే కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆయా కోర్సుల్లో సీట్లు పొందిన విద్యార్థులకు ఏపీ ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ అందిస్తుందని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు విజయవాడలో తరగతులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. కాగా, సీపెట్ అడ్మిషన్ టెస్ట్ ఆధారంగా సీట్లను భర్తీ చేస్తారని వివరించారు. cipet25.onlineregistrationform.org/cipet వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని, వివరాలకు 83093 98357 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

ఆదానికి దోచిపెట్టడానికే స్మార్ట్ మీటర్లు


స్టిక్కర్లను అతికిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు అధికారంలో లేని సమయంలో స్మార్ట్ మీటర్లు వద్దని, అధికారంలోకి రాగానే ఆదానికి దోచిపెట్టడానికి స్మార్ట్‌మీటర్లను ఒప్పుకోవడం అన్యాయమని సీపీఎం న్యూసిటీ కార్యదర్శి టి.రాముడు విమర్శించారు. గురువారం కర్నూలు నగరంలోని 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్, పీవీ నరసింహరావు నగర్, ఇల్లూరు నగర్‌లో స్మార్ట్‌మీటర్లు వద్దంటూ సీపీఎం నాయకులు ఇంటింటా స్టిక్కర్లను అతికించారు. నాయకులు రాధాకృష్ణ, ఎం.భాస్కర్, వై.నగేష్, శంకర్, శ్రీనివాసులు, విజయ్ కుమార్, రోశయ్య మద్దిలేటి పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన కలెక్టర్


హైకోర్టు జడ్జి ఎ.హరిహరనాథ శర్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్

కర్నూలు (సెంట్రల్): కర్నూలుకు వచ్చిన హైకోర్టు జడ్జి జస్టిస్ ఎ.హరిహరనాథ శర్మను కలెక్టర్ పి.రంజిత్ బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన్ను కలెక్టర్ కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆర్డీఓ సందీప్ కుమార్ పాల్గొన్నారు.

వేరుశనగ విత్తన సేకరణలో ప్రభుత్వ నిర్లక్ష్యం

కర్నూలు(సెంట్రల్): ఒకవైపు ఖరీఫ్ సమీపిస్తుండడం.. మరోవైపు వర్షాలు కురుస్తుండడంతో అన్నదాత విత్తనానికి సిద్ధమవుతున్నా సీడ్స్ కార్పొరేషన్ రైతులకు అవసరమైన వేరుశనగ విత్తనాలను అందుబాటులో ఉంచకపోవడం దారుణమని ఏపీ రైతు సంఘం మండిపడింది. ప్రభుత్వ తీరును నిరసిస్తూ గురువారం ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఇంతవరకు విత్తన కొనుగోలు కోసం కనీసం టెండర్లు పిలువకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది పరాకాష్ట అన్నారు. వెంటనే రైతులకు 90 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

యోగా శిక్షణ


యోగాసనాలు వేస్తున్న పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు

కర్నూలు (అర్బన్): యోగాంధ్ర ప్రచారంలో భాగంగా పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వి.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం పంచాయతీరాజ్ కార్యాలయంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యోగా మాస్టర్ ట్రైనర్ కళ్యాణ్ పర్యవేక్షణలో జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు మద్దన్న, ఈఈ రవీంద్రారెడ్డి, డీఈఈలు ఈరన్న, రమేష్ కుమార్ రెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాసులు, మద్దిలేటి, ఏఈఈలు అమర్‌నాథ్, సతీష్ కుమార్, ముక్తార్ బాష, ఇతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం నెల రోజుల పాటు కొనసాగనుంది.

'కాశన్నను బదిలీ చేయాల్సిందే'

కర్నూలు (అగ్రికల్చర్): ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ కర్నూలు నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న విషయంలో ఆ అసోసియేషన్‌లో వివాదం ముదురుతోంది. కర్నూలు ఏడీఏ కార్యాలయంలో కాశన్న జూనియర్ అసిస్టెంట్‌గా తొమ్మిదేళ్లుగా పనిచేస్తున్నందున బదిలీ చేయాలని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జవహర్‌లాల్ తదితరులు జిల్లా వ్యవసాయ అధికారిని కలసి కోరారు. ఆఫీస్ బేరర్‌గా తొమ్మిదేళ్లు పూర్తి కానందున అక్కడే కొనసాగించాలని జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగల్ రెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిని కలిసి కోరారు. ఏపీ ఎన్జీఓ అసోసియేషన్‌లోనే బదిలీల విషయంలో వివాదం నెలకొంది. కాగా పూర్తి ఆధారాలు సమర్పించాలని డీఏఓ వరలక్ష్మి అసోసియేషన్ నేతలను కోరారు. వివరాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

సాక్షి సినిమాలు



ఎస్వీసీ కాంప్లెక్స్ : ఏస్, శుభం, సింగిల్, మిషన్ ఇంపాజిబుల్ – ది ఫైనల్ రెకనింగ్, కేసరి చాప్టర్ 2, ఫైనల్ డెస్టినేషన్ : బ్లడ్ లైన్స్ వర్షం (2004)
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్: ఏస్, హిట్ : ది థర్డ్ కేస్, ఒక బృందావనం, నిశ్శబ్ద ప్రేమ, వర్షం (2004) వీరరాజు 1991, ఫైనల్ డెస్టినేషన్ : బ్లడ్ లైన్స్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: ఏస్, సింగిల్
శ్రీరామ: వర్షం (2004)
రాజ్ : సింగిల్
భరత్ కాంప్లెక్స్: వైభవం, అర్జున్ సనాఫ్ వైజయంతి

శరీన్ నగర్‌లో పోలీసుల నిర్బంధ తనిఖీలు

- పత్రాలు లేని 12 బైక్‌లు స్వాధీనం

కర్నూలు: కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని శరీన్ నగర్‌లో పోలీసులు కార్డెన్ సెర్చ్ (నిర్బంధ తనిఖీలు) నిర్వహించారు. నాల్గవ పట్టణ సీఐ మధుసూదన్ గౌడ్ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు, సిబ్బంది, హోంగార్డులతో కలిసి శరీన్ నగర్‌లో గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పత్రాలు సరిగా లేని 12 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాల గురించి ఎప్పటికప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని, కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కాలనీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


శరీన్‌నగర్ వాసులతో మాట్లాడుతున్న సీఐ మధుసూదన్ గౌడ్

రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్


ట్రాఫిక్ నిబంధనలపై ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ మన్సూరుద్దీన్

కర్నూలు: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలను జప్తు చేస్తామని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ హెచ్చరించారు. కొత్తపేట వద్ద ఉన్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఆటోడ్రైవర్లకు రహదారి భద్రత నిబంధనలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై చిత్రీకరించిన వీడియోలను ప్రదర్శించి ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్ అందుబాటులో ఉంచుకోవాలని, ప్రతి ఆటోడ్రైవర్ విధిగా యూనిఫాం ధరించాలని సూచించారు. రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంఘించిన వారికి మోటార్ వాహన చట్టం ప్రకారం జరిమానాతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

యోగాంధ్రను విజయవంతం చేద్దాం

- పీఆర్ ఎస్‌ఈ వీ రామచంద్రారెడ్డి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీరు వీ రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం ఆయన జెడ్పీ ప్రాంగణం విశ్వేశ్వరయ్య భవన్‌లోని తన చాంబర్‌లో కార్యాలయ ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 22వ తేదీ నుంచి జూన్ 21వ తేది వరకు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, ఇందులో అన్ని ప్రభుత్వ శాఖలు పాల్గొనేలా చర్యలు చేపట్టిందన్నారు. ఈ నేపథ్యంలోనే తమ శాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామ పంచాయతీల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే ప్రతి రోజు అందరు యోగాలో పాల్గొని ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. జిల్లాలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఇంజినీర్లు, మినిస్టీరియల్ సిబ్బంది అందరు యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో డీఈఈ బండారు శ్రీనివాసులు, ఏఈలు పార్థసారథి, విజయభాస్కర్‌తో పాటు కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్ ఎస్‌ఈ వీ రామచంద్రారెడ్డి

సీఆర్‌సీలో క్రీడాకారుల నమోదు తప్పనిసరి

కర్నూలు (టౌన్): ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న, నిర్వహించనున్న అంతర్ జిల్లా ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు తప్పనిసరిగా సీఆర్ఎస్ (సెంట్రల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్)లో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా ఫుట్‌బాల్ సంఘం సంయుక్త కార్యదర్శి నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లేని ఎడల ఎంపిక పోటీలకు అనర్హులవుతారని పేర్కొన్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, 18 సంవత్సరాలు దాటిన క్రీడాకారులు 10వ తరగతి సర్టిఫికెట్, లేదా డ్రైవింగ్ లైసెన్సు, పాన్ కార్డు, ఏఐఎఫ్ఎఫ్ (ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్) ఫీజు రూ.300 రిజిస్ట్రేషన్ రుసుంతో 98662 11480 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఫుట్‌బాల్ క్రీడాకారుడు వచ్చే నెల 15వ తేదీలోపు ఈ సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

సోషల్ మీడియాలో పోస్టు పెట్టినందుకు అరెస్ట్


మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐతో చర్చలు జరుపుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు: 'రూ.10 వేలకు గుమస్తాగా చేరిన ఒకరు కోట్లకు పడగలెత్తి నేడు కర్నూలు నగరాన్ని కాలుష్య కోరల్లో కూరుకునే విధంగా చేస్తున్నాడంటూ' సోషల్ మీడియాలో పోస్టు పెట్టినందుకు కర్నూలు మోటార్ వర్కర్స్ యూనియన్ ఆఫీస్ కార్యదర్శి వెంకటేశ్వర్లును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. గురువారం సాయంత్రం ఈ విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, నగర కార్యదర్శి రాముడు, రాజశేఖర్ ఆధ్వర్యంలో దాదాపు 50 మంది కార్యకర్తలు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. దీంతో సీఐలు శేషయ్య, రామయ్య నాయుడు తదితరులు వారిని స్టేషన్‌లోకి పిలిపించి మాట్లాడారు. ఈ సందర్భంగా కొద్దిసేపు అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. చివరగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వెంకటేశ్వర్లుకు 41ఏ కింద నోటీసు ఇచ్చి విడుదల చేసి పంపడంతో సీపీఎం కార్యకర్తలు ఆందోళన విరమించారు.

నేడు శంకుస్థాపన

కర్నూలు (టౌన్): కర్నూలు నియోజకవర్గ పరిధిలోని 19 వార్డుల్లో 31 రకాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు శుక్రవారం సాయంత్రం 4 గంటలకు మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన చేస్తారని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ ఆర్థిక సంఘం, ఎస్క్యాప్, సాధారణ నిధులకు సంబంధించి 1, 3, 6, 8, 10, 13, 14, 15, 16, 18, 23, 24, 42, 43, 44, 45, 46, 48, 49 వార్డుల్లో అభివృద్ధి పనులకు మంత్రి శంకు స్థాపన చేస్తారని వెల్లడించారు.

దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ

కర్నూలు (సెంట్రల్): సమాజంలోని అసమానతలను తొలగించేందుకు భాగ్యరెడ్డి వర్మ ఎంతో కృషి చేశారని, ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా దళిత వైతాళికుడనే బిరుదు ఉందని దామోదరం సంజీవయ్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ దామోదరం రాధాకృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతిని పెద్దపాడులో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల కోసం పని చేసిన వారిని భావితరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందని, అందులో భాగంగానే భాగ్యరెడ్డి వర్మ జయంతిని తమ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించినట్లు చెప్పారు. బహుజన విద్యావంతుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు జీవీ కృష్ణయ్య, సభ్యుడు ఈశ్వరయ్య, పోతుల శేఖర్, ఎన్.రంగస్వామి, గోవర్ధన్, మల్లికార్జున, అయ్యస్వామి పాల్గొన్నారు.

ఆసుపత్రిలో రోడ్లను బాగు చేయాలి

కర్నూలు(హాస్పిటల్): ఎంతో చరిత్ర గలిగిన ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో రోడ్లు శిథిలమై గుంతల్లో వర్షపు నీరు నిలిచి వృద్ధులు, రోగులు ప్రమాదాలకు గురవుతున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యాకోబు, రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మొహద్దీన్ వాపోయారు. గురువారం కంటి ఆసుపత్రి ప్రాంతంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం పర్యటించింది. రోడ్లపై నిలిచిన నీరు, శిథిలమైన రోడ్డును చూసి ఏపీఎంఎస్ఐడీసీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాయలసీమ జిల్లాలకు ఉచిత వైద్యం అందిస్తున్న కంటి ఆసుపత్రి రోడ్లు శిథిలమై ఏళ్లు గడుస్తున్నా సమీపంలో ఉండే అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. శిథిలమైన రోడ్డుతో పాటు ఆ ప్రాంతమంతా వ్యర్థాలతో నిండిపోయిందన్నారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏపీఎంఎస్ ఐడీసీ ఇన్‌చార్జ్ ఈఈ కరీముల్లాకు వినతి పత్రం సమర్పించారు. ఎండీ యూనుస్, ఎన్.శ్రీనివాసరెడ్డి, ఎస్.అన్వర్‌బాషా, ఎస్.మద్దిలేటి, కె.శ్రీనివాసులు, బి.శశికుమార్‌రెడ్డి, ఎస్.షాహిద్ తదితరులు పాల్గొన్నారు.


కంటి ఆసుపత్రి ముందు రోడ్ల దుస్థితిని చూపుతున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు

బస్టాండ్ పరిసరాలు శుభ్రంగా ఉంచండి

- హోటల్స్ ముందు పార్కింగ్, శానిటేషన్‌పై కలెక్టర్ అసంతృప్తి
- షాపుల్లో అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక



బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఉచిత మినరల్ వాటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

కర్నూలు సిటీ: ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వాహనాలు నిలుపుకునేందుకు పార్కింగ్, దుకాణాల నిర్వహణ, హోటల్స్‌ను పరిశీలించారు. బస్టాండ్ ఇన్, అవుట్ గేట్ల వద్ద హోటళ్ల దగ్గర వాహనాలను అడ్డదిడ్డంగా నిలపడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. శానిటేషన్ సక్రమంగా లేదని, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. బస్టాండ్‌లోని ప్లాట్‌ఫారంను పరిశీలించి అక్కడున్న ప్రయాణికులతో బస్సుల సౌకర్యాలు తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు.

తాగు నీటి సదుపాయం కల్పించాలి

బస్టాండ్‌కు రోజూ ఎంతో మంది ప్రయాణికులు వస్తుంటారని, అలాంటి చోట పరిశుభ్రమైన తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంపై కలెక్టర్ ఆర్టీసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత మినరల్ వాటర్ ఛాంబర్‌ను పరిశీలించి ఇలా ఉంటే ప్రయాణికులు నీటిని ఎలా తాగుతారని, కనీసం ట్యాప్‌లు కూడా సరిగ్గా లేవన్నారు. బస్టాండ్ మొత్తానికి తాగునీటి సదుపాయం ఒక్కచోటనే ఉండటంతో అధికారులకు పలు సూచనలు చేశారు. రెండు ప్లాట్ ఫారంలకు ఒకచోట తాగునీటి సదుపాయం ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు. అక్కడున్న తాగునీటి షాపులో వాటర్ బాటిళ్లపై కిన్లేకు బదులుగా కిన్సలీ అని లేబుల్ ఉండటంతో వాటికి ఐఎస్ఐ మార్కు ఉందో? లేదో? తనిఖీ చేయాలని ఆర్డీఓ, తహసీల్దారును ఆదేశించారు. ఆర్టీసీ ఆవరణలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసేలా మున్సిపల్ అధికారులకు నోట్ పంపాలని ఆర్ఎంకు సూచించారు. బస్టాండ్ ప్లాట్‌ఫాంల వద్ద అక్కడక్కడ పెచ్చులు ఊడటం చూసి వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. అక్కడి ఓ హోటల్‌లోకి వెళ్లి ఇడ్లి రుచి చూసి, టీ తాగారు. ధరల పట్టికను పరిశీలించి నిర్దేశించిన ధరలకే విక్రయించాలన్నారు. అనంతరం డిపో గ్యారేజీని పరిశీలించారు. బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షించిన తర్వాతే డిపో నుంచి బస్సును బయటికి పంపాలన్నారు. 9వ ప్లాట్‌ఫాం నుంచి బెంగళూరు హైవే రోడ్డుకు లింక్ చేసేలా ఆర్టీసీ ఎండీతో మాట్లాడుతానని కలెక్టర్ చెప్పారు. ఆర్డీఓ సందీప్‌కుమార్, ఆర్ఎం ఎం.శ్రీనివాసులు, అర్బన్ తహసీల్దారు వెంకటలక్ష్మీ, డిపో మేనేజర్లు సుధారాణి, కె.ఎల్.కె శర్మ, అసిస్టెంట్ మేనేజర్ వెంకటచలం, తదితరులు ఉన్నారు.

జై చిరంజీవా.. జగదేకవీర


జగన్నాథ గట్టుపై వెలసిన అభయాంజనేయ స్వామి



కార్యసిద్ధి ఆంజనేయ స్వామి, బళ్లారి చౌరస్తా ఆంజనేయస్వామి ఆలయంలో..


బండిమెట్ట అంబాభవాని ఆలయంలో స్వామివారు

కర్నూలు కల్చరల్: నగరంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైశాఖ బహుళ దశమి పురస్కరించుకొని గురువారం ఆంజనేయ స్వామి, శ్రీరామాలయాల్లో విశేష పూజలు జరిగాయి. అభిషేకాలు, ఆకుపూజలు, హనుమాన్ చాలీసా పారాయణం, భజనలు, పల్లకీ సేవలు నిర్వహించారు. బళ్లారి చౌరస్తాలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఈఓ ఆది జంబులమ్మ, భక్తులు పాల్గొన్నారు. నగర శివారులోని జగన్నాథ గట్టుపై వెలసిన అభయ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూపాల సంగమేశ్వర జగన్నాథ గట్టు అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు నరసింహారెడ్డి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.


జగన్నాథ గట్టుపై సీతారాముల పూజల్లో భక్తులు

- ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో భారత వీర జవాన్ల ఘనతను పురస్కరించుకొని పంచముఖి ఆంజనేయస్వామి సన్నిధిలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. స్వామివారికి పల్లకి సేవ, భజనలు నిర్వహించారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

- సూర్యనారాయణ స్వామి ఆలయంలో వెలసిన కార్యసిద్ధి ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, వడమాల, పూర్ణఫల సేవలు, మన్యు సూక్త హోమం తదితర పూజలు జరిగాయి. సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు.

మున్సిపల్ హైస్కూల్ మైదానంలో..


పూజలందుకుంటున్న ఆంజనేయ స్వామి

కర్నూలు కల్చరల్: సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. కర్నూలు నగరంలోని మున్సిపల్ హైస్కూల్ మైదానంలో గురువారం రాత్రి హనుమాన్ జయంతి వేడుకలతో పాటు ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. రామాయణ పారాయణం, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. విశ్రాంత డీఎస్పీ వెంగన్న చౌదరి, విశ్రాంత ఎస్‌ఐ గుర్రపుసాల అంకయ్య ప్రవచనం చెప్పారు. సమితి అధ్యక్షులు కె.క్రిష్ణన్న మాట్లాడుతూ దేశ రక్షణ దళానికి మరింత బలం, శక్తిని కలిగించి విజయం చేకూరాలని స్వామి వారిని స్మరించుకుంటూ సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశామన్నారు. సమితి గౌరవాధ్యక్షులు డాక్టర్ మోక్షేశ్వరుడు, ఉపాధ్యక్షులు మహాబలేష్, నారాయణరెడ్డి, కార్యదర్శి నాగోజి, కోశాధికారి మురళి, సభ్యులు పాల్గొన్నారు.

చెరుకుగడల పందిరిలో వీర హనుమాన్

కర్నూలు కల్చరల్: స్థానిక చాణిక్య పురి కాలనీలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం హనుమద్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్వామివారిని డ్రైఫ్రూట్స్‌తో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామివారి గర్భగుడి ముందు సుమారు వందల కిలోల చెరుకు గడలతో చలువ పందిరిని ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


చాణక్యపురి కాలనీలో చెరుకుగడల పందిరిలో డ్రైఫ్రూట్స్ అలంకరణలో స్వామివారు